క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతంపేట: అక్కయ్యపాలెం సెక్షన్ గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో రెడ్ హాట్‌లను సరిదిద్దడానికి శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు అక్కయ్యపాలెం, అబిద్‌నగర్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, ఎన్జీజీవోస్ కాలనీ, ముస్లిం తాటిచెట్లపాలెం, శాంతినగర్, కైలాసపురం, నరసింహనగర్, నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో..

మద్రిపాలెం: జోన్–2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధి 11 కేవీ రాజీవ్‌నగర్ ఫీడర్, కాకానీనగర్, ఎస్ఏడీ ఫీడర్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు రాజీవ్‌నగర్ ఫీడర్ పరిధిలో మహత్ కాలనీ, వంశీనగర్, జీబీఎస్ ఏరియా, వుడా అపార్ట్‌మెంట్స్, గంగా–గోదావరి అపార్ట్‌మెంట్స్, అప్పయ్యనగర్.. కాకానీనగర్, ఎస్ఏడీ ఫీడర్ల పరిధిలో సాకేతపురం, రెల్లివీధి, వినోద్‌నగర్, విమాన్‌నగర్, కాకానీనగర్, ఎస్ఏడీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు



పార్వతీశ్వరాలయంలో పూజలందుకుంటున్న సీతారాములు

సీతంపేట: స్థానిక పార్వతీశ్వరాలయంలో సీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఉగాది రోజున ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఏర్పాటు చేసిన సీతారాముల ఉత్సవమూర్తులకు అర్చకుడు గంగవరపు భాస్కరశర్మ నేతృత్వంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం అర్చనలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈ నెల 17వ తేదీ ఉదయం సీతారాముల కల్యాణానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో 36 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే సుపరిపాలన



కైలాసపురంలో మహిళకు కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న కె.కె.రాజు, కటుమూరి సతీష్



సీతమ్మధార రైతుబజార్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీకే మళ్లీ పట్టం కట్టండి
- ఎన్నికల ప్రచారంలో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

కంచరపాలెం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మళ్లీ పట్టం కట్టి, తన విజయానికి సహకరించాలని పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కోరారు. 46వ వార్డు కైలాసపురం జంక్షన్ నూరిబాబునగర్, కస్తూరినగర్ ప్రాంతాల్లో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించా రు. ప్రతి గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనను వివరించి, కరపత్రాలు అందించి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వంలో దీర్ఘకాలిక సమస్యలను గుర్తించి నియోజకవర్గంలో వార్డుల వారీగా అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో యువత చేరిక

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీలో 50 మంది స్థానిక యువత చేరారు. వారిని కె.కె.రాజు పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషిచేస్తామని యువత అన్నారు. కార్యక్రమంలో సేనాపతి అప్పారావు, బి.గోవింద్, కె.చిన్నా, జి.అప్పారావు, ఎన్.కృష్ణ, దూది నర్సింగ్‌రావు, కె.ఈశ్వరరావు, కె.లావణ్య, కె.రామారావు, రమణ, శ్రీను, సాయి, రాజు, వెంకటరావు, అన్నపూర్ణ, దేవి, వరలక్ష్మి, విజయలక్ష్మి, ఎం.సునీల్, అంబటి శైలేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన యువతతో కె.కె.రాజు

అభివృద్ధిని ఆదరించండి

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలు ఆదరించాలని పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు విజ్ఞప్తి చేశారు. సీతమ్మధార రైతుబజార్‌తోపాటు జిమ్‌లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించా రు. చిరువ్యాపారులు, వినియోగదారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఐదేళ్లలో అవినీతి రహిత పాలన అందించామని, కుల, మత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేశామని తెలిపారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షులు జి.వి.రమణి, జేసీఎస్ మండల కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, డైరెక్టర్ రాయుడు శ్రీను, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్‌కుమార్, జ్ఞానేష్, బి.గోవింద్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



24వ వార్డు రేసపువానిపాలెంలో కె.కె.రాజుకు హారతులిస్తున్న మహిళలు

సీఎం జగన్‌కు మరోసారి అవకాశమివ్వండి

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశమివ్వాలని, ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభివృద్ధి కె.కె.రాజు కోరారు. 24వ వార్డు రేసపువానిపాలెంలో గురువారం సాయంత్రం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక మహిళలు కె.కె.రాజుకు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, డైరెక్టర్లు, పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మహోన్నతుడు జ్యోతీరావ్ పూలే



జ్యోతీరావ్ పూలే చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడుతున్న కె.కె.రాజు

- మహనీయుల స్ఫూర్తితో జగన్ పాలన
- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- ఘనంగా పూలే జయంతి వేడుకలు

సీతమ్మధార: సామాజిక అసమానతలను రూపుమాపిన మహామనిషి మహాత్మా జ్యోతీరావ్ పూలే అని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కొనియాడారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ ఉత్తర కార్యాలయంలో గురువారం జ్యోతీరావ్ పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ మహనీయుల స్ఫూర్తితో వారి ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అన్ని రకాల పదవులతోపాటు ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, రెయ్యి వెంకటరమణ, నటుడు జోగినాయుడు, వార్డు అధ్యక్షులు, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్తకు ఘన నివాళి

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహాత్మా జ్యోతీరావ్ పూలే చిత్రపటానికి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన కులాల ప్రజలకు విద్యను అందించడంలో పూలే చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బి.తిరుమల రావు, ఎం.దమయంతి, ప్రసూనారెడ్డి, విశ్వనాథ్‌రాజు, శ్యామ్, గణేష్, వరలక్ష్మి, లత, ధర్మవతి, రాణి, అప్పలరాజు, అప్పారావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

వనితా వాకర్స్ క్లబ్ నివాళి

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త జ్యోతీరావ్ పూలే చిత్రపటానికి క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యావ్యాప్తి, మహిళా జనోద్ధరణకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి ఎ.షీలా రాణి, సంయుక్త కార్యదర్శి ఎస్.రత్నకుమారి, కార్యవర్గ సభ్యులు సురేంద్ర కౌర్, ఎ.లీలావతి, పి.సుభద్ర, ఎం.స్వాతి మాధురి పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై మరింత నిఘా

మద్రిపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సెబ్ కమిషనర్ ఎం.రవిప్రకాష్ ఆదేశాల మేరకు సెబ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.హనుమంతరావు గురువారం మురళీనగర్‌లోని సెబ్ గోపాలపట్నం సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యంపై మరింత నిఘా పెట్టి, అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలిచ్చారు. మద్యం, నగదు, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల అక్రమ రవాణా లేకుండా నిరంతరం తనిఖీలు చేస్తూ దాడులు నిర్వహించాలన్నారు. పాత నేరస్తులను బైండోవర్ చేయాలని చెప్పారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో విశాఖ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.కృష్ణమూర్తి, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ గోపాలపట్నం సీఐ ఎల్.ఉపేంద్ర, తదితర ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న సెబ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు

1,155వ రోజుకు ‘ఉక్కు’ దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,155వ రోజుకు చేరుకున్నాయి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ప్రజలు సిద్ధం కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

అన్నమాచార్య సంకీర్తన పోటీలకు ఆహ్వానం

డాబాగార్డెన్స్: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతిని పురస్కరించుకుని శృతిలయ సాంస్కృతిక భక్తి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో మే 19న పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు శృతిలయ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వేదికగా నాలుగు విభాగాల్లో జరగనున్న అన్నమాచార్య సంకీర్తన పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. పోటీలో పాల్గొనదలిచే భక్తులు పేరు, వయసు, స్కూల్ పేరు, ఆధార్ నంబర్, సెల్ నంబర్ తెలియజేయాలని, వివరాలు వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలియజేస్తామన్నారు. మే 8వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలని, వివరాలకు 98498 29297 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆకట్టుకున్న కైక, మంథర పాత్రలపై ప్రవచనం

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న సీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం రామాయణ ప్రవచనాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం పీఠం దర్బారు హాల్‌లో వక్త పేరాల హరిప్రియ రామాయణంలోని కైక–మంథర అంశంపై చేసిన ప్రవచనం సభికులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆమె ప్రవచిస్తూ రామాయణంలో కైకేయి పాత్ర చాలా క్లిష్టమైనదని, ఆ పాత్రను అందరూ అపార్థం చేసుకుని నిందిస్తుంటారని తెలిపారు. దైవకార్యం కోసం ఆమె ఆరకంగా ప్రవర్తించాల్సి వచ్చిందన్నారు. ఆ పాత్రలో కైక అలా ప్రవర్తించడం వల్లే రాముడు అడవికి వెళ్లడం, రాక్షస సంహారం జరిగాయని వివరించారు. మంథర పాత్ర కూడా శాపం కారణంగా అలా ప్రవర్తించిందన్నారు. విశ్వనాథ వారి రామాయణ కల్పవృక్షం ఆధారంగా పద్యాలను చదివి కైక, మంథర పాత్రలను చక్కగా విశ్లేషించి, అందులో దాగి ఉన్న అంతరార్థాన్ని సభికులకు వివరించారు. ఆచార్య మలయవాసిని సభాధ్యక్షత వహించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ప్రవచిస్తున్న పేరాల హరిప్రియ

అలరించిన కవి సమ్మేళనం

మురళీనగర్: క్రోధి నామ సంవత్సరంలో శ్రమజీవులకు శుభం కలగాలని పలువురు కవులు ఆకాంక్షించారు. అమరావతి విశ్వసాహితి సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మురళీనగర్ వాకర్స్ పార్కులో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనం అలరించింది. నాగుల సీతారామయ్య(అమెరికా) సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సెలెక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య ప్రసంగిస్తూ కొత్త ఏడాదిలో ప్రతి ఇంటా సిరులు కురవాలని, అందరూ ఆయురారోగ్యాలతో సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పి.ఎల్.వి.ప్రసాద్ సంధాన కర్తగా వ్యవహరించిన ఈ కవి సమ్మేళనంలో 30 మంది కవులు పాల్గొని వారి కవితా గానంతో శ్రీ క్రోధి నామ సంవత్సరాన్ని ఆహ్వానించారు. కార్మికులు, కర్షకులు శ్రమజీవులందరికీ మంచి జరగాలని తమ కవితా గానంలో వినిపించారు. సిహెచ్.చిన సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పొలమరశెట్టి ఫ్రాన్సిస్, శేఖరమంత్రి ప్రభాకర్, మేడా మస్తాన్‌రెడ్డి, ఉప్పల అప్పలరాజు, కె.వి.ఎస్.మూర్తి, కె.నరసింహం, పి.సెల్వరాజు తదితరులు కవితలు వినిపించారు.



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న నల్లనయ్య

‘టూల్స్ ఫర్ ఫ్యూచర్’పై సదస్సు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కె.కుమార్‌రాజా ఆధ్వర్యంలో ఏఐ టూల్స్ ఫర్ ఫ్యూచర్ కార్యక్రమం హోటల్ బెస్ట్ వెస్టన్‌లో గురువారం జరిగింది. మాజీ జాతీయ అధ్యక్షుడు కె.వి.రత్నం ప్రసంగించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్ చాట్ జీపీటీ అప్లికేషన్లపై ప్రదర్శన నిర్వహించారు. చాట్ జీపీటీని ఉపయోగించడం ద్వారా వ్యాపార లావాదేవీల్లో పని భారం తగ్గించుకోవచ్చన్నారు. ఈసీ సభ్యుడు డాక్టర్ కె.కె.రాజా, విశాఖ మండల చైరపర్సన్ చిట్టూరి శ్రీనాథ్, వైస్ చైర్‌పర్సన్ ఎ.లీలారాణి, మహిళా విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ గీతా శ్రీకాంత్, జేసీఐ పాస్ట్ ప్రెసిడెంట్ కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుమార్‌రాజా

భక్తిశ్రద్ధలతో రంజాన్

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పేదలు, అనాథలకు దానధర్మాలు



ముస్లిం తాటిచెట్లపాలెం ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

సీతంపేట: నియోజకవర్గంలో గురువారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, మద్రిపాలెం, కంచరపాలెం, మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజ్ అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని మసీద్–ఏ–క్యూబా, అక్కయ్యపాలెంలోని చిన్నూరు, పెద్దూరు మసీదులు, రేసపువానిపాలెం యాసిన్ మసీదుల్లో ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై నమాజు నిర్వహించారు. నెల రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలు విరమించి అల్లాహ్‌ను ప్రార్థించారు. తెల్లని దుస్తులు ధరించి మసీదులకు, ఖబ్రస్తాన్‌లకు వెళ్లి ప్రార్థనలు చేశారు.

ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు

జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని మసీద్ ఏ క్యూబా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఈద్‌గాలో ఘనంగా ప్రార్థనలు జరిగాయి. ముస్లింలు పేదలకు(ఫిత్రా) దానధర్మాలు చేశారు. అనంతరం మత పెద్దలతో కలిసి ఈద్ ఉల్ ఫిత్ర్ నమాజ్ ఆచరించారు. మత పెద్దలు ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

➡ 80 ఫీట్ రోడ్ ఈద్‌గాలో మజీద్ హఫీజ్ ముస్తేజాబ్ తురుక్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరి నమాజ్ చేశారు. అబిద్‌నగర్‌లోని ఇదారా ఈ ఇమామే రజాలో మౌలానా అబిద్ ఆలీ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు.



అబిద్‌నగర్‌లోని ఇదారా ఈ ఇమామే రజాలో రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

➡ జీవీఎంసీ 26వ వార్డు చిన్నూరులో మసీద్ ఈ నూర్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు అధిక సంఖ్యలో నమాజ్ చేశారు. మత పెద్దలు, మసీద్ ప్రతినిధులు ఖురాన్ చదివి వినిపించారు. నమాజ్‌కు ముందు పేదలు, అనాథలకు ఫిత్రా, జకాత్ దానాలు చేశారు. జగ్గారావు బ్రిడ్జి వద్ద ఖబ్రస్థాన్‌లో పెద్దల సమాధుల వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు.

ముస్లింల నమాజ్, ర్యాలీ

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీదును విద్యుద్దీప కాంతులతో అలంకరించారు. వేకువ జామున ఫజర్ నమాజ్‌ను ఆచరించిన ముస్లింలు మద్రిపాలెం పరిసర ప్రాంతాల్లో ర్యాలీ చేశారు. అనంతరం ఈద్గా(ప్రార్థనా స్థలం) వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌ను ఆచరించారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సమీప ప్రాంతంలో ముస్లింల శ్మశానవాటికకు చేరుకుని పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమాన్ని మసీదు కమిటీ అధ్యక్షుడు మున్నా పర్యవేక్షించారు.

షర్బత్‌ల పంపిణీ

మురళీనగర్: మురళీనగర్ సమీపంలోని అయ్యప్పనగర్ మసీదు ఈ–నభవిలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు సిరాజుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటలకు మసీదు ప్రార్థనా మందిరంలో నమాజ్ చేశారు. మాధవధార, మురళీనగర్, ఎన్జీజీవోస్ కాలనీ, బర్మా కాలనీ, సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ ప్రాంతాల నుంచి సుమారు 400 మంది ముస్లింలు పాల్గొని అల్లాను ప్రార్థించారు. అనంతరం ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. యువకులు ప్రత్యేకంగా తయారు చేసిన షర్బత్‌ను ప్రార్థనలో పాల్గొన్న వారికి పంపిణీ చేశారు.



53వ వార్డు జాకీర్‌హుస్సేన్ నగర్‌లో ఈద్గా వద్ద నమాజ్ ఆచరిస్తున్న ముస్లింలు



అయ్యప్పనగర్ మసీదులో నమాజు చేస్తున్న ముస్లింలు



చిన్నూరులో ముస్లిం యువత సందడి

రోడ్డుపై ప్రైవేటు బోరు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు నందగిరినగర్‌లో ఒక వ్యక్తి తన కుటుంబ వ్యక్తిగత అవసరాల కోసం ప్రభుత్వ స్థలంలో బోరు వేయించడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చాలా ఏళ్ల అధ్వానంగా ఉన్న ఈ రహదారిని కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ చొరవతో రెండు నెలల కిందట సీసీ రోడ్ కొత్తగా నిర్మించారు. ఆరు నెలల వరకు అక్కడ తవ్వకూడదని నిబంధన ఉన్నా పాటించకుండా యథేచ్ఛగా రోడ్డును తవ్వి బోరు వేయిస్తున్నారు. ఈ విషయం కార్పొరేటర్ దృష్టికి రావడంతో ప్రభుత్వ స్థలమా.. ప్రైవేటు స్థలమా అన్నది ఇంటి డాక్యుమెంట్లు, జీవీఎంసీ మాస్టర్ ప్లాన్ పరిశీలించి నిర్ధారించాలని ఇంజినీరింగ్, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలకు ఆదేశించారు. అప్పటి వరకు బోరు పనులు ఆపాలని ఇంటి యజమానితో చెప్పారు. అయినా ఇవేమి పట్టకుండా ఇంటి యజమాని బోరు ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన రోడ్డును తవ్వి బోరు వేయడం ఏంటని, తన ఇంటి స్థలంలో బోరు తీయించుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



నందగిరినగర్‌లో రోడ్డును తవ్వి వేస్తున్న ప్రైవేటు బోరు